# తొలి కోరిక

## అడుసుమల్లి మల్లికార్జున

చిరు సంధ్యా సమయం

సూర్యుడు వొదిలిన బంగారు రంగుతో అక్కడక్కడ నిలిచి వున్న మేఘాలు మెరుస్తున్నాయి పడక కుర్చీలో కూచొని హృద్యమైన ఆ దృశ్యాన్ని చూస్తున్న నాకు కమ్మగా ఓ సిగరెట్ వెలిగించాలనిపించింది

వెంటనే చిన్నగా నవ్వుకున్నాను

సరిగ్గా మూడు రోజుల క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు కదలాడింది

ఆ రోజు– నాపెళ్ళినాటి తొలి రాత్రి

ఇష్టమైన భార్యను ముద్దు పెట్టుకోటానికి ప్రయత్నించి విఫలమైనాను

ప్రేమగా అడిగాను

అందంగా ఎర్రగా మెరిసి పోతూవున్న పెదవుల మీద చూపుడు వ్రేలు పెట్టి తల అడ్డంగా వూపింది– నా భార్య

'ఎందుకని? అన్నాను

'మీరు సిగరెట్లు మానండి అప్పుడు అంది

ఆడవాళ్ళు చాలా తెలివి గలవాళ్ళు ఎప్పుడు ఏ బాణం వేయాలో వాళ్ళకే తెలుసు

వెంటనే ఆప్యాయంగా నా జుత్తులోనికి వేళ్ళు పోనిస్తూ ప్రేమగా అంది

నాకు ఆ వాసన గిట్టదండి ప్లీజ్ నా కోసం మానేయండి "

ఆ మాటలకు బ్రహ్మదేవుడైనా దంగైపోవాల్సిందే!

అల్ప్రాణ్ నేనెంత

"అట్లాగే అని హామీ ఇచ్చేశాను

అదీగాక నేనేమీ ఛైన్ స్మోకర్‌నికాదు కులాసగా వున్నప్పుడు ఎప్పుడైనా ఓ సిగరెట్ తగలేసేవాన్ని అది బాగా అలవాటై పోయాక మా ఇల్లాలు కోరివుంటే– అప్పుడు పరిస్థితి ఎట్లా వుండేదో! ఏమో!!

సరే! ఇల్లాలి తొలి కోరిక

మణులా? మాన్యాలా?

అందుకే శుభ్రంగా మానేశాను

ఆలోచనతో తియ్యని జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆకాశం వొంక చూస్తున్న నేను ఉలిక్కిపడి ఇటు చూశాను

గుండ్రంగా, దిబ్బ రొట్టెలా వున్న శేషుగాడు భూమిని దడ దడ లాడిస్తూ వస్తున్నాడు

వాడ్ని చూడగానే నా మనసు ఆనందంతో నిండిపోయింది

కీకారణ్యంలో తోడు దొరికినట్లైంది

ఇద్దరం ఆషాఢమాసం అల్లుళ్ళమే!

మా పెళ్ళిళ్ళు జరిగిన ఓ వారం రోజులకల్లా ఆషాఢమాసం భూతంలా వచ్చి పడింది

చచ్చినట్లు మేమిక్కడైతే– భార్యామణులు అక్కడ

ఒకే మాసపు పక్షులం కాబట్టి హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు

అక్కణ్ణించే చిరునవ్వులు చిందిస్తూ వచ్చాడు

ఓ కుర్చీ లాక్కుని ప్రక్కనే వేసుకుని నా భుజం మీద చేయి వేసి ముసి ముసిగా నవ్వాడు

కొత్త పెళ్ళి కొడుకు కళ వాడిలో స్ఫుటంగా కనిపిస్తోంది

నిజం చెప్పాలంటే శేషుగాడు కొంచెం అమాయకుడనే చెప్పుకోవాలి కాని చాలా మంచివాడు ఎదుటి వారిని బాధపెట్టడం చాతకాని ఉత్తముడు

ఏమిట్రోయ్! అత్తగారిల్లు గుర్తు వొస్తోందా' అన్నాను నవ్వుతో

ఆ మాటతో వాడు గబగబ నవ్వేస్తూ–

నాకో సాయం చేయాల్రా అన్నాడు

ఈ ఆషాఢ మాసం వెళ్ళేవరకూ ఏదైనా చేస్తాను చెప్పు

అటు ఇటు చూసి– చప్పున నా చెవిని లాక్కున్నాడు

చచ్చాను గట్టిగా కేక వేద్దామనుకున్నంతలో చెవిలో రహస్యంగా సిగ్గుగా చెప్పాడు

నాకు సిగరెట్ త్రాగటం నేర్పించు

ఆ మాటతో బిత్తరపోయాను చెవి నొప్పి కాస్తా మాయమైపోయింది

వాడి వంక ఎగాదిగా చూశాను

ఇబ్బందిగా ముఖం పెట్టి వీపు మీద చరిచాడు

బాధ అనిపించలేదు కాని వీపు మాత్రం పూరీలా పొంగి పోయి వుంటుంది

నేను ఎప్పుడో ఒకటి కాలుస్తుంటే– నా ముందు తాగకురా ఇడియెట్ అని ప్రేమగా మందలించే శేషుగాడు ఇట్లా అడిగేసరికి వెర్రివాడనైపోయాను

లోకాన్ని పాలించటానికి నల్లగా తయారై చీకటి రాజు బయల్దేరుతున్న సమయం వీధి దీపాలు వెలుగుతున్నాయి

ఇద్దరం కాలినడకన అట్లా బయల్దేరాం

ఈ విపరీత కోర్కెకు కారణం ఏమిటా? అని బుర్ర బద్దలు చేసుకుని– ఇహ లాభం లేదనుకొని వాన్నే అడిగేశాను

ఎందుకో నేర్చుకోవాలనిపించిందోయ్ అన్నాడు కులాసగా నవ్వుతూ

ఆ మాటలో నిజం లేదని వాడికి తెలుసు నాకూ తెలుసు

కాసేపు బ్రతిమాలించుకుని తీరిగ్గా అసలు రహస్యం బైట పెట్టాడు ఈ రహస్యం ఎక్కడయినా చెప్తే నా తల వేయి వక్కలై పోతుందని కూడ శాపం పెట్టాడు

పడక గదిలో వాడి భార్య అడిగిందట

ఏమండి మీరు సిగరెట్లు తాగుతారా?

లేద ని కాలర్ ఎగరేసి చాలా గొప్పగా చెప్పేడట శేషు

తెలుస్తూనేవుంది మీ పెదాలు ఎర్రగా ఉన్నాయి సిగరెట్ కాల్చే వాళ్ల పెదాలు నల్లగా నిగనిగలాడుతూ వుంటాయి

శేషుగాడు గొప్ప జనరల్ నాలెడ్జి బిట్ దొరికిందని సంతోషపడుతున్నంతలో మళ్ళీ తనే అందట

నేర్చుకోండి ప్రెస్టేజియస్‌గా వుంటుంది

నాకు అలవాటు లేదు

అందుకే నేర్చుకోండి అని బుగ్గ మీద ముద్దు పెట్టిందట

శేషుగాడి భార్య పేరు రంగనాయకి బాగా చదువుకున్న అమ్మాయి అందంగా అంతకంటే చలాకీగా వుంటుంది ఆ అమ్మాయికి ఈ కోరిక పుట్టడం ఏమిటో నాకు అర్థం కాలేదు

చెప్పలేం కదా!!

ఎవరి వూహలు వాళ్ళవి

ఎవరి కోర్కెలు వారివి

మొత్తానికి ఒకందుకు నాకు ఆనందం కలిగింది శేషుగాడు ఒక విధమైన వుత్సాహంతో వురకలు వేస్తున్నాడు అది సిగరెట్ మీద ఇష్టం కాదు– భార్య మీద ప్రేమ కావొచ్చు

అట్లా నడుస్తూ వూరి బైటకు వెళ్లాక–

తక్కున సిగరెట్ ప్యాకెట్, అగ్గిపెట్టె తీసి– నా చేతిలో పెట్టి

నేర్పించు అన్నాడు

గురుడు మందుగుండు సామగ్రితో రెడీ ఐ వచ్చాడు

సారీ రా అన్నాను– వాడి చేతిలో సిగరెట్ పెట్టి, అగ్గిపెట్టె పెడ్తూ

కోడి పిల్ల వంక గ్రద్ద చూసినట్లు నా వొంక చూశాడు

తర్వాత ఎలుక వొంక పిల్లి చూసినట్లు కూడా చూశాడు

ఇంకెట్లా చూస్తాడోనని భయపడి నిజం చెప్పేశాను

నేను మానేశాను

ఎందుకని అదేదో నేరంలాగా ప్రశ్నించాడు

తనకోసం త్రాగమని బ్రతిమాలాడు ఇహ లాభం

లేదనుకుని ఆ పొజిషన్ వగైరా నేర్పమని కూలబడ్డాడు

ద్రోణాచార్యుడిలా ఓ ఫోజిచ్చి- సిగరెట్ అంటించటం మొదలు- ఆఖరి దమ్ము వరకు వివరంగా విపులంగా ఆ నిశ్శబ్ద రాత్రిలో వాడికి బోధించాను

వాడు అర్జునుడి కంటే ఏకాగ్రతతో విన్నాడు గురువు దగ్గర వున్న విద్య అంతా నేర్చుకోవాలన్న తృష్ణ వాడి కళ్లలో ప్రతిఫలించింది

అట్లా ఆ రాత్రి వాడికి 'సిగరెటోపదేశం చేశాను

శిష్యుడి ప్రావీణ్యత చూసి ముచ్చటపడాలనే మక్కువతో ఒక సిగరెట్ తగలెట్టమన్నాను

వాడిలో అప్పుడే గురుభావం పెల్లుబికింది కాబోలు-

అటు తిరిగి పది పుల్లలు గీచి సిగరెట్ అంట్టించాడు-

అంతే!!

కళ్లలో కారం పడ్డ వాడిలా గిలగిల్లాడిపోయాడు

పొగతో వాడి ముక్కూ నోరు ఏకమై పోయింది

విపరీతమైన ఎగ్గు

రవంతసేపు తర్వాత తెప్పరిల్లి నా వొంక చూశాడు

కన్నీళ్లు చెంపల మీదుగా జారుతున్నాయి

అయ్యో! అనుకున్నాను

వాడు మాత్రం పట్టు వదలని విక్రమాదిత్యుడిలా వున్నాడు దీని సంగతేమిటో తేల్చుకోవాలన్న స్థిరత్వం వాడి చూపుల్లో కదలాడింది

ఇవాల్టికి చాలువెళ్దాం అన్నాను

నువ్వెళ్లు నేను రాను అన్నాడు

చచ్చినట్టు కూలబడ్డాను

★ ★ ★ ★ ★ ★

నెల రోజులు గడిచిపోయాయి

మా బాధల్ని తోడు తీసుకుని ఆషాఢం కాస్తా వెళ్లిపోయింది

కొత్త భార్యలు క్రొత్త సంసారాలు

రోజులు ఆనందంగా గడిచి పోతున్నాయి

శేషు కనిపిస్తున్నాడు నోట్లోనో చేతిలోనో ఎర్రగా కాలుతూ సిగరెట్ అగుపిస్తూనే వుంటుంది

అది మామూలు విషయమై పోయింది

శేషు రంగనాయకి  ా కలిసి ఓ రోజు లంచ్‌కి వచ్చారు కబుర్లాడుతూ బైట కూచున్నాం లంచ్ రెడీ అయ్యేసరికి నాలుగు సిగరెట్లు తగలేశాడు

నాకెందుకో బాధేసింది

రంగనాయకి మాత్రం శేషు సిగరెట్ కాలుస్తున్నప్పుడల్లా చాలా గర్వంగా ఫీలవటం గమనించి మౌనంగా వుండిపోయాను

శేషులో చిన్న చిన్న మార్పులు గమనించాను

అంతకు ముందు నుదుట చిన్న బొట్టు పెట్టుకుని, ప్రశాంతంగా చక్కని చిరునవ్వుతో వుండేవాడు ఇప్పుడు వాడి ముఖంలో అంతటి ప్రశాంతత కరువైందనే చెప్పాలి ముఖంలో రవంత చీకాకు కూడ ద్యోతకమవుతోంది

కాని సిగరెట్ కాలుస్తున్నప్పుడు మాత్రం చాలా ఇష్టంగా సుఖంగా ఫీలైపోతున్నాడు

రోజులు గడిచిపోతున్నాయి

శేషుగాడికి సిగరెట్ ఆరో ప్రాణమైపోయింది

ఎంతమందిలో వున్నా ఎలాంటి పనిలో వున్నా వాడు సిగరెట్ త్రాగాల్సిందే ఆఖరికి సినిమాహాల్లో కూడా పిక్చర్ మధ్యలో ఒకటికి నాలుగుసార్లు బైటకు వచ్చి సిగరెట్ కాల్చి వెళ్లేవాడు

ఏ అలవాటు లేని వ్యక్తి ఏదైనా ఒక దానికి అలవాటు పడితే దాని ప్రబావం ఆ వ్యక్తి మీద ఎంతగా వుంటుందో- శేషుని చూస్తే అర్థమయిపోతుంది

ఒక రోజు రంగనాయకి హఠాత్తుగా మా ఇంట్లో ప్రత్యక్షమైంది

కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పింది

అన్నయ్యా! ఆయన విపరీతంగా సిగరెట్లు



తగలేస్తున్నారు! ఆరోగ్యం ఏమవుతుందోనని భయంగా వుంది మీరెట్లాగైనా వారి చేత ఆ అలవాటు మాన్పించండి

"నేనా?"

అవును మీరుచెప్తే వింటారు

నాకు ఏమాత్రం నమ్మకం లేదు ఆ మాట ఆవిడతో చెప్పి బాధపెట్టడం ఇష్టంలేక–

అట్లాగే తప్పకుండా ప్రయత్నిస్తాను అని హామీ యిచ్చి పంపించాను

ఆ సాయంత్రం శేషుగాన్ని కలిశాను

ఐపోయిన సిగరెట్‌తో మరో సిగరెట్ అంటించుకుని, నవ్వుతో పలకరించాడు

అప్పుడప్పుడు చిన్నగా దగ్గుతున్నాడు

ఏమిట్రా ఇది? అన్నాను– ట్రాజిడీగా ముఖం పెట్టి

ఏమిటి?

ఇది అంటూ సిగరెట్ ప్యాకెట్ చూపించాను

పొగ త్రాగనివాడు దున్నపోతై పుట్టున్ అంటూ పెద్దగా నవ్వేశాడు

తాగి మానినవాడు?

మనిషై పుట్టున్

బ్రతికించావ్" అన్నాను నవ్వుతూ

ఏమిట్రా కబుర్లు అన్నాడు మరో సిగరెట్ కాలుస్తూ

శేషూ! ఇహ నువ్వు సిగరెట్లు కాల్చటం మానెయ్యాలిరా" అన్నాను వాడి ముఖంలోకి చూస్తూ

ఎందుకు?

ఆరోగ్యం కూడ చూసుకోవాలి కదా!"

నా ఆరోగ్యానికి ఇప్పుడు ఏం ప్రమాదం వచ్చి పడింది అసలు మనం త్రాగే నీరు పీల్చే గాలి, తినే తిండి ఆరోగ్యకరంగానే వున్నాయంటావా? అంతా కల్తీ ఇదొక్కటే కల్తీ లేనిది అన్నాడు ప్రేమగా సిగరెట్ వొంక చూస్తూ

మాటలు బాగా నేర్చావురా

'సిగరెట్ కాలిస్తే కవిత్వం కూడ రాయొచ్చు– శ్రీశ్రీ లాగా"

# ప్రేలని బాణసంచా

దీపావళికి వింత వింత
బాణాసంచా వచ్చింది
ప్రతిపక్షాలు అధికారంలో
ఉన్నవారూ ప్రయత్నిస్తున్నారు
వాటిని కాలుద్దామని
అవి ప్రేలడం లేదు కాని
పత్రికలకు కావలసినంత
మందు గుండు దొరికింది
బోఫోర్సు శతఘ్నులు
నిశ్శబ్దంగా మోగుతున్నాయి
దళారీలు ఎవరో అన్వేషణ
'రామ్ సీతాన్వేషణ
చెకోస్లవేకియా పిస్టోళ్లు
వచ్చాయి అవి 'టాయ్'
ఆయుధాలు అంటున్నారు
పిల్లలకు శివకాశిసరుకు
రావడం కుదరదు
ఎక్సైజ్ అధికారులకు
ఉత్పత్తిదార్లకూ
సుంకంపై జగడం
ఈసారి తాటిగిలక
టపాసులు కట్టండి
గోగు కాడలు కాల్చండి
రోలు, రోకళ్ళు ప్రేల్చండి
అపేనయం ఉండదు భయం

–ఎం ఎస్ ఎం

# తొలి కోరిక

సంతోషించాం గాని– నేను వొస్తాను

అప్పుడే

సమాధానం చెప్పకుండా బైటపడ్డాను

వాడ్ని గురించిన ఆలోచనలతో నా మనసు కకావికలం అయిపోయింది రంగనాయకి మీద కోపం కూడా వచ్చింది ఐనా తన తప్పు మాత్రం ఏముంది? భర్త ఎంచక్కా సిగరెట్ కాలిస్తే చూచి ఆనందించాలనుకుంది పిడేమో అదే లోకంగా ప్రవర్తించటం మొదలుపెట్టేడు

ఇప్పుడు చెప్పినా వినే స్థితిలో లేడు అందుకే మౌనంగా వొచ్చేశాను నాకే ఇట్లా వుంటే– పాపం రంగనాయకి పరిస్థితి ఎట్లా వుంటుందో!

తర్వాత ఓ వారం రోజుల వరకు శేషుని కలవటానికి వీలుపడలేదు ఈలోపు రంగనాయకి తన ప్రయత్నాలు తను చేస్తూనే వుంది పాపం

వాడి చేత ఆ అలవాటు మాన్పించటానికి వక్కపొడి అలవాటు చేసిందట వాడు వక్కపొడి వేసుకుని ఎంచక్కా సిగరెట్ తగలెట్టటం మొదలెట్టాడట కొద్ది రోజులు పడక గదిలో రానీయకుండే– ఒక్కడే చక్కగా బైట చాప వేసుకుని, ఆకాశం వొంక చూస్తూ కమ్మగా సిగరెట్లు తగలెట్టేసే వాడట

ఆ ఇల్లాలు చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసి, ఇంకా ఏమి చేయాలో తెలీక గమ్మగా వుండిపోయింది

నేను ఏ పని చేస్తున్నా శేషుగాడి గురించిన ఆలోచనలే చుట్టుముట్టేవి

ఆ ఇల్లాలి సమస్యను ఎట్లా పరిష్కరించాలి?

శేషుగాన్ని ఎలా రక్షించాలి?

ఆ అలవాటు మానుకోవడం నిజంగా అంత కష్టమా? సమయానికి నా భార్య రక్షించింది గాని లేకుంటే నేను కూడ ఇట్లాంటి స్థితిలోనే వుండేవాణ్ణేమో!

అందుకేనేమో! ఓ ప్రముఖ రచయిత అంటాడు–


సిగరెట్ మానివేయటం చాలా సులభం నేను ఎన్నోసార్లు మానివేశాను


అనుభవజ్ఞుడు ఎంత చక్కగా చెప్పాడో!

శేషుగాడి గురించిన ఆలోచనలు ఒక కొలిక్కి రాక ముందే– వినకూడని వార్త విని ఆసుపత్రికి పరుగెత్తాను

రంగనాయకి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఎదురు వొచ్చింది

చిరునవ్వులు చిందిస్తూ బెడ్ మీద పడుకుని వున్నాడు– శేషు



నా కళ్ళల్లో చప్పున నీళ్ళు తిరిగాయి

దగ్గరగా వెళ్ళి వాడి నుదుటి మీద చెయ్యి వేసి-

శేషు అన్నాను

ఇదంతా నా తప్పు అన్నయ్యా! నాకు ఇట్లా జరగాల్సిందే అని రంగనాయకి ఏడుస్తోంది

అసలేం జరిగింది? అన్నాను

నిన్న సాయంత్రం వరకు బాగానే వున్నారన్నయ్యా భోజనం చేసే ముందు కొంచెం గుండె నొప్పిగా వుందన్నారు అప్పుడే డాక్టర్ దగ్గరకు వెళ్దామంటే ఒప్పుకోలేదు రాత్రి రెండు గంటలకు విపరీతమైన గుండె నొప్పి వచ్చింది కన్నీళ్ళు తుడుచుకుంటూ జరిగినదంతా చెప్పింది రంగనాయకి

శేషు మాత్రం వదలని నవ్వుతో అట్లాగే చూస్తున్నాడు

డాక్టరుగారు ఏమంటున్నారు?

సిగరెట్‌లు మానేయాలంటున్నారు మంచి ఆహారం తీసుకుంటే సరిపోతుంది ఇది మొదటిసారి కాబట్టి ప్రాణానికి దోకాలేదు అన్నారు శేషు సమాధానం చెప్పాడు

నేను సీరియస్ అయిపోయాను

ఇంతకీ నువ్వేం నిర్ణయించుకున్నావ్?

భార్య తొలి కోరిక మన్నించటం కనీస ధర్మం కదరా! నీ భార్య మాట ప్రకారం నువ్వు మానేయలేదా? అట్లాగే నేను అలవాటు చేసుకున్నాను ఇప్పుడు మానాలంటే




కుదురుతుందా? అదీగాక అందువల్లనే గుండె నొప్పి వస్తుందని రూలేమైనా వుందా? పొగ త్రాగే వాళ్ళందరికి గుండె నొప్పి వస్తే- ఈ భూమి మీద ఇంతమంది వుంటారా? గుండె నొప్పికి సిగరెట్‌కి సంబంధం లేదంటాను

వాడి మాటల దోరణి చూస్తుంటే నాకు ఆశ్చర్యంగా వుంది

రంగనాయకి మాత్రం ఏడుస్తూ శేషు పాదాల మీద పడి-

నన్ను క్షమించండి ఇప్పుడు నేనే చెప్తున్నాను కదా! మానుకోండి అంటోంది

రంగనాయకిని చూస్తుంటే ఓ ప్రక్క దిగులు-

మరో ప్రక్క కోపం-

లోకంలో ఎక్కడైనా భర్తకున్న చెడ్డ అలవాట్లను మాన్పించే భార్యలుంటారు కానీ లేని అలవాట్లను నేర్పించే భార్యలుంటారా? ఒకవేళ వున్నా దాని ఫలితం ఎట్లా ఉంటుందో తలుచుకుంటేనే భయంగా వుంది

రంగనాయకి మాత్రం ఇంతగా వూహించి వుంటుందా? వూహించి వుంటే అలాంటి కోరిక కోరి వుండేదా?

శేషు ప్రక్కనే కూచొని చిన్నగా అన్నాను

శేషు! నీకు చెప్పే అంతటి వాణ్ని కాదు- ఇల్లాలి తొలి కోర్కె తీర్చావు కదా! మలి కోర్కె కూడ తీర్చరా? గాద్గికమైన నా గొంతులోని ఆప్యాయత వాణ్ని కదిలించినట్లుంది

ప్రేమగా నా చెయ్యి నిమురుతూ-

రాత్రే నిశ్చయించుకున్నానురా మరెప్పుడూ సిగరెట్ ముట్టకూడదని అన్నాడు స్థిరంగా

ఆనందంతో రంగనాయకి కళ్ళు తళుక్కుమన్నాయి

తృప్తిగా శేషు వంక చూశాను

నీకు ఇష్టమే కదూ భార్య వంక చూస్తూ నవ్వేడు శేషు

నన్ను క్షమించండి అంది రంగనాయకి.

ఆ ఒక్క మాటలో కోటి అర్థాలు స్ఫురించాయి- నాకు ☐



